# మక్కువకే రెక్కలుంటే

బొండు మల్లెలు ఒత్తుగా పరచి జలతారు జాలర్లు వ్రేలాడదీసిన పడకటింటి పందిరిమంచంలా తెల్లగామిలమిలా మెరిసిపోతోంది. ఎదురుగుండావున్న మహాసముద్రం ఉత్సాహంతో ఉవ్వెత్తుగా లేచిపడుతూన్న ఆ సముద్రపు కెరటాల అంచులపై మెరపుతీగల్ని సృష్టిస్తూన్న చందమామ, శ్రీధరర్‌పై తనకివున్న మధుర భావనలా స్వచ్ఛంగా ఎత్తుగా ప్రకాశిస్తున్నాడు. శ్రీధర్ సమక్షంలో తనని గదిలో వదిలేసి తలుపు జేరేస్తూ పడుచుముత్తదువులందరూ ఒక్క శృతిలో ఫక్కుమంటూ చేసిన చిలిపి అల్లరిలా సముద్రం అంతా మాంచి హడావిడిగా వుంది.

ఆ అల్లరి సముద్రానికి అవతలనుంచి రావాలి తన శ్రీధర్! అందుకే ఒడ్డున ఉన్న తమ మేడమీద నిలబడి పొద్దుటినుంచి ఇప్పటిదాకా సముద్రంలోకి ఒక్కవంసని చూస్తోంది. జ్యోత్స్న సముద్రంమీద కనిపించే ప్రతీ నల్లని మచ్చా ఓడగా చూపు దాలుస్తుందనీ, ఆశతో అంచనాలు వేస్తూ నిమిషాల్ని యుగాలుగా గడుపుతోంది.

అతిభద్రంగా దాచుకొన్న శ్రీధర్ రాసిన ఉత్తరాన్ని ఇప్పటికి యెన్నిసార్లు తీసి చదువుకుని గుండెలకి హత్తుకొని తిరిగి దాచుకుందో

ఏమైనా సరే యీ రోజుకి వచ్చితీరతానని రాశాడు. పద్దెనిమిదేళ్ల తీయ తలపుల బరువుతో తలవంచుకొని సరిగ్గా ఏడాదిక్రితం యిదే రోజున తలుపుదగ్గర నిలబడ్డ జ్యోత్స్నని మధురంగా వూహించుకుంటూ మరీ వస్తానన్నాడు. కెప్టెన్ కాదంటే బతిమాలుకుని అయినా యీ రోజుకి ఓడ విశాఖ పట్నంవచ్చి వాలేలాగా చూస్తానన్నాడు. ఇంత ఇలా రాశాక రాకుండా ఉంటాడా?

వస్తాడు. తన శ్రీధర్ తప్పకుండా వస్తాడు. ఇన్నాళ్ళగా నిరీక్షించిన తాను ఇంక ఎంతసేపో యెదురు చూడనక్కరలేదు. ఎన్నాళ్లనుండి ఎదురుచూసింది తాను!

ఆరు నెలలనుంచి, నూట ఎనభై రోజులనుంచి అంటే నలభై మూడువేల... అమ్మో తలుచుకుంటేనే భయం వేస్తోంది. అలాంటిది తను ఎలా గడిపిందో ఏమో...!

అబ్బ ఇన్నాళ్ళనుంచీ యెదురుచూడ్డం ఒక ఎత్తు, ఇవ్వాళ యెదురు చూడ్డం అంతా ఒక ఎత్తూలా వుంది. ఉదయం తెల్లారక ముందే ఉత్సాహంతో లేచి తలంటి నీళ్ళుపోసుకుని, శ్రీధర్‌కి యిష్టమయిన నీలిరంగు చీరకట్టుకుని ఒదులుగా జడవేసుకొని అతని కోసమనే రెండు ఎర్ర గులాబులు తురుముకుంది జడలో-పొద్దుట అనగా మేడ

మీాదికి వచ్చిన జ్యోత్స్న చంద్రోదయం అయినా ఇప్పటి వరకూ అలా సముద్రంలోకి కళ్లు నెప్పులు పుట్టేలాగా ఒక్క వరసని చూస్తూనేవుంది. ఎన్ని ఓడలయినావచ్చాయి కాని శ్రీధర్ ఓడమాత్రం రానే లేదు.

ఆకాశంలో చంద్రుడు తెలి మబ్బులచాటున దోబూచులాడుతున్నాడు ప్రక్కమేడలో గడియారం బద్ధకంగా పదిగంటలు కొట్టింది. జ్యోత్స్న బరువుగా నిట్టూర్చింది. అబ్బ! ఇంకా రారేమిటి? ఇంతసేపు అయినా ఇంకా రాకపోతే ఎలా? మనస్సుకి ఉత్సాహంపోయి నరాల్లో నీరసం బయలుదేరింది. తనతోబాటు తలలో గులాబులుకూడా శ్రీధర్ కోసం యెదురు చూసి చూసి తలలు వాల్చి రేకల కన్నీళ్ళు రాలుస్తున్నాయి. వెలిగించిన అగర వత్తులు తన ఓర్పులాగే యిప్పటికి యెన్ని మసి అయిపోయాయో! తిరిగి తిరిగి కొత్త ఆశతో కొత్త వాటిని వెలిగించి గాజు ఏనుగుకు గుచ్చి శ్రీధర్ ఇంకా వస్తాడు ఇంకా వస్తాడు అని ఎదురుచూస్తోంది.

పొద్దుట అనగా ఎక్కిన యీ ఆశలమేడ దిగవలసిందే! ... ఇంకరారూ ... పది దాటితే రాకూడదని యేం వుంది? ... అంత గట్టిగా వస్తానని రాశాక రాకుండా ఉంటారా? ... వస్తారు .. వస్తే ఈ పాటికి రావలసిందే ...

ఇలా ఆశా నిరాశల మధ్య ఊగిసలాడుతూ లేచి ఆఖరుసారిగా అగరువత్తులు వెలిగించివచ్చి పడక కుర్చీలో వఱుంవాల్చింది జ్యోత్స్న.

ఎదురుగుండా వెన్నెట్లో మెరుస్తూ ఉద్రూతలూగుతూ సముద్రం ఎంత ఉత్సాహంగా వుంది. ఎందుకో యీ ఉత్సాహం? శ్రీధర్‌నీ తననీ విడదీస్తూ యింత విశాలంగా మనమే పరుచుకొని ఉన్నాం అనా? ఇలా ఉత్సాహంగా వున్న సముద్రం అలా వుండక మళ్ళీ ఘోష పెడుతుం దెందుకు? తన మనసులోలాగే పాపంగాని హృదయంలో కూడా ఏదయినా జడదానలం దాగి వుందా?

లోపల ఏ వ్యధ వున్నా పైకిమాత్రం చంద్ర కాంతిలో మిలమిలా మెరిసిపోతూ ఉత్సాహంగానే వుంది. మల్లెల మంచంలా తెల్లగా పరుచుకున్న యీ సముద్రం తన కా రోజు జ్ఞప్తికి తెస్తోంది. సరిగా ఇవాల్టికి ఏడాది క్రితం. అప్పుడుకూడా యింతే. బొండుమల్లెలు నిండుగా జల్లిన పందిరిమంచం పరిమళాలు వెదజల్లుతూ యిలాగే వుంది తనకీ శ్రీధర్‌కీ మధ్య.

గదిలో తలుపుదగ్గిర మంచానికి ఇటు తను అటు శ్రీధర్. గుండె వేగంగా కొట్టుకుంటోంది ఏ మధురక్షణం కోసమో అణువణువునా పులికిస్తూ భయంగా భారంగా.

గదినిండా మల్లెల గుబాళింపుతో కలిసి మత్తెక్కి స్తూన్న అగరువత్తుల వాసన.

అంతలోనే చైతన్యం కోల్పోయి తిమ్మిరెక్కినట్లు మనస్సుకి ఒక సుఖమయిన బాధ!

తలుచుకుంటే ఇప్పుడు పారవశ్యంలో కళ్ళుమూతలు పడుతున్నాయి.

సుఖంగా, హాయిగా.

శరీరం అంతా బరువుగా, జడంగా ఇదీ అని చెప్ప లేని యేదో ఒక మధురభావన! తీయని ఈ బాధతో ఇలా ఎంతసేపో! ఎంతసేపో!

అంతే ... అంతలో ...

మెడదగ్గర వెచ్చని ఊర్పు-

మేను ఝల్లుమంది ఏమైంది తనకి? గుండె ఆగిందా? రక్త ప్రసరణ స్థంభించిందా? శరీరం ఏమిటి ఇంత దూది పింజలా ... అసలు శరీరం ఉందా. కరిగి అనుభూతిగా మారి పోయిందా? ... తను గాలిలో తేలిపోతూ ఎక్కడికి? ... ఎటు? ...

అటు .. అటు ... అదేమిటి?

అంతదూరంలో నవ్వుతూ ఆకర్షణ!

తనకీ నవ్వుతూన్న ఆ వెలుగుకీ మధ్యన కరిగిపోతున్న ఈ కాంతి కెరటాలేమిటి?

ఈ కాంతిమీద యిలా తను అనంతంగా జారుతూ, గాలిలో తేలుతూ ఆ వెలుగువైపు... నవ్వుతూన్న ఆ ఆకర్షణవైపు ... అ ... లా ... అ ... లా ... తే ... లు ... తూ ... జా ... రుతూ .. ఇక్కడ యిలా యేదో తెలియని ఒక అవ్యక్తమైన మధురస్థితిలోకి జ్యోత్స్న కరిగిపోతూంటే ...

♦ ♦ ♦

కేబిన్‌లో, కింద బెర్తుమీద పడుకున్న శ్రీధర్ మత్తుగా, అయిష్టంగా కళ్లు తెరిచాడు, పై బెర్తుమీద పడుకున్న సర్దార్ తనకేసే గుడ్లప్పగించి చూస్తున్నట్లనిపించింది. తిరిగి మళ్ళీ కళ్ళుమూసుకుని తెగిన ఆ తియ్యని కల మళ్ళీ అతుక్కుంటుందేమో అని ప్రయత్నించాడు. ఊహుఁ... సరే! స్థిమితంగా కళ్ళు తెరిచాడు. సర్దార్ ఇంకా తనకేసి రెప్పవాల్చకుండా చూస్తూనే వున్నాడు.

శ్రీధర్ నవ్వుతూ "ఏం భాయ్! నిద్దరోలేదా?" అంటూ హిందీలో పలకరించాడు.

సర్దార్ సమాధానం ఏం చెప్పలేదు.

శ్రీధర్ కేసి చూడ్డమూ మానలేదు

శ్రీధర్ ఆశ్చర్యంగా "అదేమిటి నన్ను అలా వింతగా చూస్తావు ఎప్పుడూ చూడనట్టు?"అని తనని తానో మాటు పరిశీలించుకుని "ఓహో! సూటుతో పడుకున్నాననేగా? ఈ నల్లసూటు నా పెళ్ళినాటిదిలే."

సర్దార్‌లో చలనంలేదు.

"ఏమిటి సర్దార్ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్? మనం వచ్చి వచ్చి ఈ సూయజ్ కాలువలో చిక్కుకుపోయాం ఏమిటి అనేనా? ఏం చెయ్యం! ఇంతలో ఇజ్రేలూ, ఈజిప్టూ తగవులాడుకుంటాయని, మన ఓడ ఈ సూయజ్ కాలువలో చిక్కుకుపోతుందనీ, ఈ కాలువ బాగుపడేదాకా మనకి మోక్షం లేదనీ మనం యేమైనా ముందుగా కలగన్నామా?"

సర్దార్ ఊ అనలేదు ఆ అనలేదు. "నీకేం? నాసంగతి చూడు. ఆ మధ్య మన కెప్టెన్ చెప్పిన దాన్నిబట్టి వారం రోజుల క్రితానికే బొంబాయి వస్తాం అనీ, అక్కడనుంచి, కనీసం నిన్నటికేనా వైజాగ్ చేరుకుంటాననీ, ఇంటికి వారం క్రితం ఉత్తరంకూడా రాశాను. పాపం నిన్నల్లా నా భార్య ఎదురు చూసి చూసి వుంటుంది నాకోసం" అన్నాడు శ్రీధర్ బాధగా.

"అదృష్టవంతుడివి" అప్రయత్నంగా ఏదో ఆలోచిస్తూ అన్నాడు సర్దార్.

శ్రీధర్ వెంటనే తెల్లబోయి, అంతలోనే సర్దుకుంటూ "ఎందుకంత ఈర్ష్య భాయీ! నువ్వూ పెళ్ళిచేసుకోబోతున్నావుగా ఈ వేసవిలో!" అన్నాడు.

ఈమాటకు సర్దార్ ఉలిక్కిపడి గడ్డం ముడీ, తలపాగా సర్దుకుని చేతినున్న కడియం వెనక్కి తీసుకుంటూ, "ఆఁ ఏమిటి? పెళ్ళా? హుఁ... చేసుకుంటే నిన్నరాత్రిలాంటి అమ్మాయిని చేసుకోవాలి, పెళ్ళి" అన్నాడు.

"రాత్రి అమ్మాయెవరు? అసలు సంగతేమిటి?" కుతూహలంగా ప్రశ్నించాడు శ్రీధర్ లేచికూచుంటూ.

"నీకు తెలియదూ? అవును లే! నువ్వు నిద్దరపోతున్నావుగా అన్నట్లు? నాకూ నిద్దరపట్టేసివుంటే ఆ అమ్మాయిని నేనూ చూసి ఉండకపోదును."

"ఏ అమ్మాయి?... ఏం కథ? సస్పెన్సుపెట్టి చంపక

సవివరంగా చెబుదూ" అన్నాడు శ్రీధర్. సర్దార్జి లేచి కూచుని బాసింపెట్టు వేసుకుని చెప్పడం ప్రారంభించాడు. "ఇంటికి వెళ్ళలేకపోయానని తెగబాధపడి బాధపడి చివరకి నువ్వా క్రింద బెర్తుమీద నిద్రపోయావా? నాకు నిద్ర రాక అలా కాసేపు డెక్ మీద తిరిగివచ్చి, కేబిన్ తలుపు దగ్గరగా వేసి, పై బెర్తుమీద నడ్డి వాల్చాను ... ఇలా కళ్ళు మూశానో లేదో, కేబిన్ తలుపు కిర్రుమంటూ చప్పుడయింది. కళ్ళు తెరిచాను."

శ్రీధర్ ఆతురతగా వినసాగాడు. "ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి నెమ్మదిగా లోపలికివచ్చి నిద్రపోతూన్న నిన్ను చూసి తలఊపి యిటూ అటూ పరకాయించింది. ఏం చేస్తుందా అని నేను కొద్దిగా చూస్తూ కండ్లుమూసుకున్నట్లు నటించాను!"

శ్రీధర్ ఊపిరి బిగపట్టి మరీ వింటున్నాడు.

"ఆ సుందరి ఒంగుని నీ పెదవులమీద రెండుమూడు సార్లుముద్దుపెట్టుకుని ఇంతలోకే బయట వాచ్ మన్ కేక విని పిచ్చి కాబోలు తడబడుతూ వెళ్ళిపోయింది. నీలంరంగు చీర కట్టుకుని జడలో గులాబులు పెట్టుకుని ఆ అమ్మాయి ఎంత అందంగా వుందనీ? ... ఎవరో ఆ అమ్మాయి డెక్ మీద ఎప్పుడూ చూసిన జ్ఞాపకంలేదు. శ్రీధర్ భయ్యా! చేసుకుంటే అలాంటి అమ్మాయిని పెళ్లిచేసుకోవాలి? లేకపోతే ..." "షటప్!" కేబిన్ అదిరిపోయేలాగా అరిచాడు శ్రీధర్.

ఆ కేకకి సర్దార్ ఉలిక్కిపడ్డాడు.

శ్రీధర్ ముఖంలో కుంకుమ పడినట్లయింది. కోపంతో ఒళ్ళంతా ఊగిపోతూ, "ఆమె యెవరో తెలుసా? ఆమె నా భార్య! నాజ్యోత్స్న! తెలివితక్కువగా వాగావంటే జాగర్త" అని గర్జించాడు. సర్దార్ గతుక్కుమని శ్రీధర్ కేసి తెల్లబోయి చూశాడు.

కొంతసేపు యెవరూ మాట్లాడలేదు.

కాస్సేపు శ్రీధర్ కోపానికి ఆశ్చర్యపోతూ "కోప్పడకు భాయీ!... ఆమె నీ భార్య అన్నావే! మరి ఆమె ఇక్కడికి యెలా వచ్చింది. ఎక్కడి సూయజ్ కాలవ, ఎక్కడి వైజాగ్!" అన్నాడు సానునయంగా.

శ్రీధర్ సర్దార్‌ని ఒకమారు యెగాదిగా చూసి "అవును వైజాగ్ అయితేనేం వారణాసి అయితేనేం?... కలలో రావడానికి ఆశ్చర్యం ఏమిటి?" అన్నాడు.

"కలేమిటి భాయీ!" అన్నాడు మరీ ఆశ్చర్యపోతూ.

"నువ్వు ఇందాక చెప్పిందంతా నాకు పోయినరాత్రి కలలో వచ్చిందే? నీలంరంగు చీర, ఎర్రగులాబులతో ఓ కలలో ఆమె నా దగ్గరకువచ్చింది, కల కరిగి కనులు తెరచి చూద్దును కదా నువ్వు నా కేసి తెల్లబోయి చూస్తూ కనిపించావు."

"కలేమిటయ్యా నా కళ్ళతోనే నేను ఆమెని చూస్తే."

"అసంభవం! నా కల నువ్వేలా చూస్తావ్?"

"మరి చూడకపోతే ఎలా చెప్పగలిగాను. ఆమె అందమైందని?"

"ఇంక ఇంతటితో ఆ ప్రస్తావన ఆపుచెయ్యి. నా భార్య అందం గురించి నువ్వు అంతగా మాట్లాడితే బాగుండలేదు. ఇంకా మాట్లాడావంటే మర్యాద దక్కదు."

అంతటితో ఆ వాదన ఆపుచేసి ఇద్దరూ కేబిన్ దాటి రాబోయారు ఇంతలో గులాబీరేకు ఒకటి దగ్గర కనిపించి శ్రీధర్ గతుక్కుమన్నాడు.

అది చూసి "ఈమాటైనా నామాట నమ్ముతావా భాయీ" అనబోయి వెంటనే శ్రీధర్ ముఖకవళికలు చూసి భయపడి మాట మధ్యలోనే ఆగిపోయాడు సర్దార్.

◆ ◆ ◆

ఆ తరువాత కొన్నాళ్ళకి ఓరోజున జ్యోత్స్న ముంగురులు సవరిస్తూ శ్రీధర్ యిలా అన్నాడు:

"వస్తానన్నరోజుకి నేను రాలేకపోయానని నువ్వు పాపం యెంతో నిరాశ చెంది వుంటావు కదూ! నేను కూడా ఆ రోజుని యెంత బాధపడ్డానని? చివరికి నువ్వు నా దగ్గరికి వచ్చినట్లు కలకూడా వచ్చింది. నా భార్య కలలోకి

వచ్చిందయ్యా అంటే-నా స్నేహితుడు సర్దార్ ఏమని వాదించాడో తెలుసా? "కలేమిటి ఆమె నిజంగానే వచ్చింది నా కళ్లారా నేను చూశాను అని; పిచ్చివాడు" అన్నాడు శ్రీధర్ నవ్వుతూ.

"ఎవరూ? ఆ గెడ్డం ఉన్నతనేనా? పై బెర్తుమీద పడుకున్నాడూ" అంది జ్యోత్స్న యేదో జ్ఞాపకం వచ్చినట్లయి.

ఆమె మాటలు వింటూంటేనే శ్రీధర్ నవ్వు ఆగిపోయింది. ఒక్కక్షణం మతిపోయి అమట్టునే గుడ్లప్పగించి చూస్తూ నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

"ఏమిటీ! ... అతను నిద్రపోతున్నట్లు జ్ఞాపకం నాకు."

"ఏమిటి జ్యోత్స్నా? నీమాటలు వింటూంటే నాకు మతిపోతోంది. భయంతో వళ్ళు జలదరిస్తోంది. ఇవన్నీ నీకెలా తెలిశాయి. ఆరోజు సర్దార్ నాతో యిలాగే వాదించాడు. చిత్రంగా ఉందే! కల వచ్చిందయ్యా అంటే అతనూ నమ్మలేదు. ఇప్పుడేమో నీవు వచ్చినట్లే అనిపిస్తోందనడం, నాకు భయంతో వళ్ళు జలదరిస్తోంది. ఇద్దరూ ఒకరకమైన అనుభూతి కోసమే, తహతహలాడటంవల్ల భార్యాభర్తలం కనుక మక్కువవల్ల భ్రమపడవచ్చు. మరి సర్దార్ చూశానంటే యెలా నమ్మడం?" అన్నాడు కంగారుగా—

జ్యోత్స్న మాత్రం తాపీగా "మీరప్పుడు మన పెళ్లి నాటి నల్ల సూటులో ఉన్నారు... అవునా? నాకేవిటో ఆ రోజున మీ దగ్గరికి వచ్చినట్లూ, మిమ్మల్ని చూసినట్లే అని పిస్తోంది" అంది. "వాట్!" అంటూ గట్టిగా అరిచి జ్యోత్స్న కేసి ఆశ్చర్యంగా చూస్తూ ఆ మట్టునే నిలబడి పోయిన శ్రీధర్ కి,

ఎక్కడినుంచో గులాబీరేకు ఒకటి ఫక్కున నవ్వి నట్లనిపించింది.

"ఏమో మక్కువకే రెక్కలుంటే?"